# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 261 | పేజీలు: 4 | వెల: రూ.4/- | సోమవారం 18 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

# యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం
## యూనిట్-3లో ఎగసిపడిన మంటలు



### టర్బైన్ వద్ద చెలరేగిన మంటలు
### ఆయిల్ లీకేజ్ వల్లే ప్రమాదమని ప్రాథమిక నిర్ధారణ
### ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
### ఘటనపై అంతర్గత విచారణకు ఆదేశం

**హైదరాబాద్, మే 17 (నమస్తే ఉదయం)**

నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణ దశలో ఉన్న యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ స్టేషన్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్-3లో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. యూనిట్-3 పరిధిలోని టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పంప్ వద్ద లూబ్రికేషన్ ఆయిల్ లీక్ కావడమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా అధికారులు అంచనా వేస్తున్నారు. చమురు లీకేజీ కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, ప్లాంట్ ప్రాంగణమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. ఈ ప్రమాదంలో పంప్ ఏరియాలోని కంట్రోల్ కేబుళ్లు, కొన్ని కీలకమైన వాల్వ్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే, ప్లాంట్ సిబ్బంది, అక్కడే ఉన్న అగ్నిమాపక యంత్రాలు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. దీంతో బాయిలర్లు, మెయిన్ టర్బైన్లు వంటి ప్రధాన యంత్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న తెలంగాణ జెన్‌కో ఉన్నతాధికారులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నష్టాన్ని అంచనా వేయడంతో పాటు, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు తెలుసుకోవడానికి అంతర్గత విచారణకు ఆదేశాలు జారీ చేశారు.




నేడు జన్మదినం జరుపుకుంటున్న ఆత్మీయ మిత్రులు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీ యూ డబ్ల్యూ జె) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు, నమస్తే ఉదయం దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ **మేకల దామోదర్ రెడ్డి**కి హార్థిక జన్మదిన శుభాకాంక్షలు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నాము. దేవుడు మేకల దామోదర్ రెడ్డి కి మంచి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, సుఖ సంతోషాలు, ఐష్టశ్వర్యాలతో దీవించాలని మనసారా కోరుకుంటున్నాము.

ఇట్లు...

నమస్తే ఉదయం సిబ్బంది, సహచర పాత్రికేయ మిత్రులు




### ఉప్పల్ రింగ్‌రోడ్
# మూసివేత
### ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గాలు
### ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల దృష్ట్యా నిర్ణయం
### నాగోల్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు
### ఉప్పల్ భగాయత్ మీదుగా మళ్లింపు

# రాష్ట్ర పోలీసులే చూసుకుంటారు

### పోక్సో కేసులో బండి భగీరథ్ అరెస్ట్
### ఇప్పటికే సరెండర్ అయ్యాడన్న కిషన్ రెడ్డి
### బండి భగీరథ్‌తో పార్టీకి సంబంధం లేదు



**హైదరాబాద్, మే 17 (నమస్తే ఉదయం)**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్టు అయ్యాడని, అంశంపై ఈ సమయంలో చర్చించాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కేసుతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పూర్తిగా రాష్ట్ర పోలీసులే ఈ వ్యవహారాన్ని చూసుకుంటారని, విపక్షాలు విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చి మోసం చేసిందని, కనీసం రైతులు పండించిన ధాన్యం కొనలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తన నిర్లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం ..మిగతా 2లో

# తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

### ఫలితాలు విడుదల చేసిన కేశవరావు
### eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌లో ర్యాంకులు
### పరీక్షలు పూర్తయిన ఆరో రోజే ఫలితాలు




**హైదరాబాద్, మే 17 (నమస్తే ఉదయం)**

తెలంగాణలో ఎప్‌సెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్‌టీయూ వీసీ టి.కిషన్ కుమార్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. గతేడాది కంటే ఇంజినీరింగ్‌లో ఈసారి 0.1 శాతం ఉత్తీర్ణత పెరిగిందని అధికారులు తెలిపారు. కాగా వారం రోజుల్లో కౌన్సెలింగ్‌కి షెడ్యూల్ ప్రకటిస్తామని జేఎన్‌టీయూ అధికారులు వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో ..మిగతా 2లో

### బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి
# బర్తరఫ్ చేయాలి

### బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం
### పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు అరెస్ట్
### ఈ నేపథ్యంలోనే కేటీఆర్ విమర్శలు
### నిందితుణ్ని 9 రోజులు కేంద్ర మంత్రే దాచారని ఆరోపణ
### బాధిత కుటుంబాన్ని బెదిరించారన్న కేటీఆర్



**హైదరాబాద్, మే 17 (నమస్తే ఉదయం)**


కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్- నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో ..మిగతా 2లో




### పద్మ అవార్డుల ప్రదానోత్సవానికి
# సర్వం సిద్ధం
### మే 25న రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా వేడుక

**న్యూఢిల్లీ, మే 17 (నమస్తే ఉదయం)**

దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారాలైన 'పద్మ అవార్డుల' ప్రదానోత్సవానికి ముహూర్తం ఫిక్స్ అయింది. ఈ నెల 25న న్యూఢిల్లీలోని రాష్ట్రీయ భవన్‌లో ఈ వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వివిధ రంగాలలో దేశానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డులను ప్రదానం చేయనున్నారు. అయితే, ఈ ఏడాది వివిధ రంగాలకు చెందిన మొత్తం 131 మంది ప్రతిభావంతులను కేంద్ర ప్రభుత్వం ..మిగతా 2లో

2

### భారత్ తిరిగి రానున్న
# చోళ రాగి ఫలకాలు
### ప్రధాని మోదీకి అప్పగించిన నెదర్లాండ్స్

# సెంట్రింగ్ పనుల బంద్‌కు ప్రతి ఒక్కరు సహకరించాలి

**మైలార్ దేవుపల్లి సెంట్రింగ్ యూనియన్ నాయకులు**

**బుద్వేల్, మే 17 (నమస్తే ఉదయం)**

సెంట్రింగ్ పనులు చేసుకునే కార్మికులకు సరైన ధరలు లేక పోవడం కారణంగా చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని, సెంట్రింగ్ పనులు నిర్వహించే వారికి ప్రభుత్వం సహకారం అందజేయాలని అసోసియేషన్ సలహాదారులు వేముల వెంకటేశ్ అన్నారు. పనికి తగ్గ ఫలితం ఉండాలనే ఉద్దేశ్యంతో మైలార్దేవుపల్లి సెంట్రింగ్ యూనియన్ ఆధ్వర్యంలో పనులను బంద్ చేయడం జరిగిందన్నారు. ఇదే విషయాన్ని మైలార్దేవుపల్లి పోలీసులకు వినతి పత్రం అందజేసి వివరిం చడం జరిగిందన్నారు. సెంట్రింగ్ పనులకు ఇచ్చే డబ్బులు చాలా తక్కువగా ఉ



మైలార్ దేవుపల్లి ఇన్స్ పెక్టర్ సత్యనారాయణ కు వినతి పత్రం అందచేస్తున్న సెంట్రింగ్ యూనియన్ నాయకులు

న్నాయని, వాటిని పెం చడానికి కార్మికశాఖ లో ఉన్న అధికారులు సూచనలు చేయాలన్నారు. సెంట్రింగ్ కార్మికులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందజేయాలన్నారు. ఇదే విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా సెంట్రింగ్ పనులు బంద్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందుకున్న మైలార్దేవుపల్లి ఇన్స్ పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, శాంతియుత వాతావరణంలో సెంట్రింగ్ అసోసియేషన్ సభ్యులు నిరసన తెలుపుకోవాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. సెంట్రింగ్ కార్మికులు, యూనియన్ సభ్యులు తమ హక్కులను అడగడం వారి హక్కు అని, అదే సమయంలో ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలార్దేవుపల్లి సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షులు ఎం దర్శన్, ఉపాధ్యక్షుడు ఎస్ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి పి అశోక్, కోశాధికారి ఎస్ బాల్ రాజ్, సంయుక్త కార్యదర్శి ఎం దేవప్ప, గద్దె యాదగిరి, బి ధన్ రాజ్, శేఖర్, సింహాద్రి, రామక్రిష్ణ, పాల్గొన్నారు.

# తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

**మొదటి పేజీ తరువాయి...**

1,97,241 మంది
ద్యార్థులు పరీక్ష రాయగా 1,44,704 మంది మంది విద్యార్థులు అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 84,954 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే, 73,294 మంది అర్హత సాధించారు.

పరీక్ష పూర్తయిన ఆరో రోజే ఫలితాలు విడుదల : ఎప్‌సెట్ పరీక్ష పూర్తయిన ఆరో రోజే ఫలితాలు వెలువడటం విశేషం. ఇంజినీరింగ్‌లో టాప్-10 ర్యాంకర్ల వివరాల్ని విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ యోగితా రాణా వివరించారు. ఫలితాల కోసం లింక్ క్లిక్ చేయండి. ఫలితాల లాగిన్ విండోలో అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి ర్యాంక్ కార్డును సులభంగా డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మాలో టాపర్స్‌గా నిలిచిన వారి వివరాల్ని సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో 3వ, 4వ ర్యాంకులో నిలిచిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు. కాగా అగ్రికల్చర్, ఫార్మాలో 6,7,9వ స్థానాల్లో నిలిచిన వారు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు అని అధికారులు తెలిపారు.

ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో 73.36 శాతం ఉత్తీర్ణత : గతేడాది ఇంజినీరింగ్‌లో 73.26 శాతం కాగా ఈసారి 73.36 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. గతంలో పోలిస్తే అగ్రికల్చర్ ఫార్మాలో ఉత్తీర్ణత 1.55 శాతం తగ్గింది

ఎప్‌సెట్‌లో ఇంజినీరింగ్ విభాగంలో టాప్-10 ర్యాంకర్లు :

ఎం.రుషి (మేడ్చల్-మల్కాజ్‌గిరి)
అన్మల్ (మేడ్చల్)
ఎం.వంశీధర్ రెడ్డి (కడప)
జె.రోషన్ మణిదీప్‌రెడ్డి (గుంటూరు)
ఎ. సాయినిఖిత్ (మహబూబ్‌నగర్)
ఎం.అస్నా (మేడ్చల్)
వి.శరద్ మహీశ్వరి (హైదరాబాద్)
టి.శ్రేయాస్‌రెడ్డి (హైదరాబాద్)
బి.సమీరాజ్‌రెడ్డి (రంగారెడ్డి)
ఆర్.జయంత్ శేఖర్ (మేడ్చల్)

అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో టాప్-10 ర్యాంకర్లు :

ఎం.అహ్మద్(హైదరాబాద్)
టి.నివృత్ సాయికిరణ్(హైదరాబాద్)
జి.సాహితి గీతిక(రంగారెడ్డి)
ఎం.జయసింహ(హైదరాబాద్)
ఎ.అన్వాస్(హైదరాబాద్)
ఎన్.జెరూష(సత్యసాయి జిల్లా)
పి.అనురాగ్(తూర్పు గోదావరి)
బి.సాయిశరణ్(సూర్యాపేట)
ఎం.మారుతి సత్యశ్రీకర్(తూర్పు గోదావరి)
ఎం.రుతుంబిక(మేడ్చల్)

ఆరు రోజుల్లోనే ఫలితాలు : పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించిన జేఎన్‌టీయూహెచ్ యాజమాన్యానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా ఎప్‌సెట్ పరీక్ష నిర్వహించిన అనంతరం ఆరు రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర పోలీసులే చూసుకుంటారు

మీద, అధికారుల మీద నెట్టేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. రైతు రుణమాఫీ పూర్తి చేయలేదు, రైతు కూలీలకు, కౌలు రైతులకు హామీ ఇచ్చి మోసం చేసింది.. లక్షల మంది రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యంతో బ్యాంకుల్లో డీఫాల్టర్లుగా మారారు.. అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల విషయాలపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి, మంత్రులు ఎదురుదాడులపైనే దృష్టి పెడుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో సజావుగా కొనుగోళ్లు ఎందుకు చేయడం లేదో చెప్పలేని పరిస్థితి.. ఈసారి కూడా దిగుబడి పెరిగిందని దానికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టడం లేదన్నారు.

# బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని అనుమానం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు 9 రోజుల పాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికే గాక దేశానికే అవమానమని మండిపడ్డారు.



## భారత్ తిరిగి రానున్న
# చోళ రాగి ఫలకాలు
### ప్రధాని మోదీకి అప్పగించిన నెదర్లాండ్స్

**న్యూఢిల్లీ, మే 17 (నమస్తే ఉదయం)**

భారతదేశం అద్భుత దౌత్య, సాంస్కృతిక విజయాన్ని సాధించింది. 11వ శతాబ్దానికి చెందిన చారిత్రక 'చోళ రాగి ఫలకాలను' నెదర్లాండ్స్ నుంచి భారత్‌కు విజయవంతంగా తిరిగి తీసుకురానుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో శనివారం జరిగిన ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో ఈ కళాఖండాలను అధికారికంగా తిరిగి అప్పగించారు. ఈ క్రమంలోనే నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. 19వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ అసాధారణమైన రాగి ఫలకాలను జాగ్రత్తగా భద్రపరిచిన లైడెన్ విశ్వవిద్యాలయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్-నెదర్లాండ్స్ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలకు ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలిచింది.

మరోవైపు వారసత్వ సంపదను తిరిగి పొందడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. "ప్రతి భారతీయుడికి ఇది ఒక ఆనందకరమైన క్షణం! 11వ శతాబ్దానికి చెందిన చోళుల రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి భారతదేశానికి తిరిగి రానున్నాయి. ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను. చోళుల రాగి ఫలకాల్లో 21 పెద్ద ఫలకాలు, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై ఎక్కువగా ప్రపంచంలోని అత్యంత అందమైన భాషల్లో ఒకటైన తమిళంలోని రచనలు ఉన్నాయి. ఇవి రాజేంద్ర చోళుడు × తన పూర్వీకులు తండ్రి, మొదటి రాజరాజ చక్రవర్తి చేసిన మౌఖిక వాగ్దానాన్ని అధికారికంగా నెరవేర్చడానికి సంబంధించినవి. అవి చోళుల గొప్పతనాన్ని కూడా చాటిచెబుతాయి. భారతదేశంలో చోళులు, వారి సంస్కృతి, సముద్రయాన పరాక్రమం పట్ల ఎంతో గర్వపడుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు.

ఇవి నెదర్లాండ్స్‌లో లైడెన్ ఫలకాలుగా, భారతదేశంలో అనైమంగళం రాగి ఫలకాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాచీన శాసనాలను తిరిగి తీసుకురావాలని భారత్ 2012 నుంచి అవిశ్రాంతంగా ప్రయత్నిస్తోంది. సుమారు 30 కిలోగ్రాముల బరువున్న ఈ 21 రాగి ఫలకాలు, చోళ సామ్రాజ్య అధికారిక రాజముద్రను కలిగిన ఒక భారీ కంచు ఉంగరంతో ఉంది. ఇది భారత సరిహద్దుల వెలుపల ఆ రాజవంశానికి సంబంధించిన అత్యంత కీలకమైన ఆధారాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఈ గ్రంథాలు సంస్కృతం, తమిళం రెండింటిలోనూ ఉన్నాయి. ఇతర దేశాలు దొంగిలించిన వారసత్వ సంపదను తిరిగి పొందే విషయంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న విజయాలకి ఇది నిదర్శనంగా నిలిచింది.

ఇదిలా ఉండగా భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. ఈ మేరకు ఆ దేశ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్ మధ్య చర్చల సందర్భంగా రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర రంగాల్లో కలిపి ఇరు దేశాలు 17 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. చర్చల



# విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే

**జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 17(నమస్తే ఉదయం)**

చక్కటి విద్యా బుద్ధులు నేర్పించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి అన్నారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, కలలను సాకారం చేసుకునే దిశగా ముందుకు వెళ్లాలని అన్నారు. భవిష్యత్తులో స్థిరపడేందుకు పదవ తరగతి తరువాత ఎంచుకునే మార్గం ఎంతో కీలకం అయినందున, మీకు ఇష్టమైన కోర్సులలో చేరాలని, ఈ విషయంలో ఎవరు ఏం అనుకుంటారో అనే సంశయాలు, మొహమాటానికి లోను కాకూడదని విద్యార్థులకు సూచించారు. ఎంచుకున్న గమ్యాన్ని ఎలా చేరుకోవాలి అనే దానిపై స్పష్టత కలిగి ఉండాలని, ఆ దిశగా అంకిత భావంతో కృషి చేస్తే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకోగల్గుతారని అన్నారు. అపజయాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా నిరంతర కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. బలహీనతలను అధిగమిస్తూ, స్పష్టమైన ప్రణాళికతో కృషి చేస్తే తప్పక విజయం వరిస్తుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం వాటిల్లకుండా తమ గురుతర బాధ్యతకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అప్పుడే గురువు అనే స్థానానికి మరింత గౌరవం, వన్నె లభిస్తూ సార్థకత చేకూరుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంపొందిస్తూ, మెరుగైన విద్యా బోధనకై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే అన్ని ప్రభుత్వ బడులలో సీ.ఎం బ్రేక్ ఫాస్ట్ (అల్పాహారం) పథకాన్ని అమలు చేయనుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ ఎస్ సి ,ఇంటర్ టాపర్లను , క్రీడల్లో మంచి పెర్ఫార్మన్స్ చూపిన ముగ్గురు విద్యార్థులకు తలా 10000 రూపాయల చొప్పున నగదు పురస్కారం, ప్రశంస పత్రం అందజేశారు.

# స్థానిక సమస్యలపై బండి రమేష్ పాదయాత్ర

**దిల్ కుష్ నగర్ సమస్యలపై త్వరలోనే పరిష్కారం**

**కూకట్ పల్లి, మే 17 (నమస్తే ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో గల దిల్ కుష్ నగర్ లో ప్రజా సమస్యలపై టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆదివారం విస్తృతంగా పాదయాత్ర నిర్వహించారు. కాలనీవాసులు తమ సమస్యలను రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా గతంలో తాము ఐడిపిఎల్ స్థలం రహదారి నుంచి రాకపోకలు సాగించేవారమని అయితే ఇటీవల ఈ రహదారికి అడ్డంగా ఫెన్సింగ్ చేశారని దీంతో తమకు తీవ్ర అసౌకర్యంగా ఉందని వారు ఆందోళన వెల్లిబుచ్చారు. దీన్ని ఈ ఫినిషింగ్ తొలగించి రహదారిని పునరుద్ధరించాలని కోరారు. దీంతోపాటు ఈ కాలనీ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో డ్రైనేజీ నీరు పొంగిపొర్లి రహదారులపై ప్రవహిస్తుందని దుర్వాసన వెలువడుతోందని వెంటనే కొత్తడ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో నైట్ ప్యాట్రోలింగ్ లేకపోవడంతో అసాంఘిక శక్తులు రెచ్చి పోతున్నాయని ఈ పరిస్థితి కాలనీ ప్రజలుగా తమకు ఇబ్బందిగా పరిణమించిందని వెంటనే పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రమేష్ ఈ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే అధికారులతో మాట్లాడుతానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, పుష్ప రెడ్డి, శివకుమార్, శ్రీకాంత్ పటేల్, యుగేందర్, ప్రసన్న కుమార్, నరేందర్, బాల నరసింహ, సదానందం, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

## పద్మ అవార్డుల ప్రదానోత్సవానికి
# సర్వం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

పద్మ అవార్డులకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. సమాజ సేవ, కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, వర్తకం-పరిశ్రమలు వంటి విభిన్న రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారికి ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు ఐదుగురికి పద్మ విభూషణ్. 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు అందజేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లోని చారిత్రాత్మక దర్బార్ హాల్‌లో జరగనున్న ఈ అధికారిక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, విదేశీ ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

# గ్లాడీ ప్రేంసన్‌కు సన్మాణం



గ్లాడీ ప్రేమ్ సన్ ను సన్మానిస్తున్న మన్నా చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్, బ్రదర్ డానియల్, బ్రదర్ సాయిలు లు



గ్లాడీ ప్రేమ్ సన్‌తో మామయ్య రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్, అత్తయ్య సిస్టర్ సీ హెచ్ ప్రభావతి, అమ్మ సిస్టర్ విజయ, పిన్ని సిస్టర్ కృపా కుమారి, తమ్ముడు డానీ, కోడలు జెమిమా లు

**బుద్వేల్, మే 17 (నమస్తే ఉదయం)**

టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) లో ఎల్ఎల్ఎం ప్రథమ సంవత్సం పూర్తి చేసుకుని సుప్రీంకోర్టు లో ఇంటర్న్షిప్ చేయడానికి అవకాశం వచ్చిన గ్లాడీ ప్రేం సన్ ను రాజేంద్రనగర్ మన్నా పుల్ గాస్పెల్ చర్చి తరపున ఆదివారం సన్మానించారు. చర్చి పాస్టర్ రెవరెం డ్ సీహెచ్ జాన్ మోజెస్, బ్రదర్ సాయిలు ఆధ్వర్యంలో ఈ సన్మాణం జరిగింది. ఆరాధన లో సిస్టర్ కృ పాకుమారి బైబిల్ సందేశాలను అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్ సీహెచ్ ప్రభావతి, సిస్టర్ విజయ, బ్రదర్ డానీ, సిస్టర్ జెమీమా తదితరులు పాల్గొన్నారు.

**గ్లాడీ ప్రేమ్ సన్ సేవలు మరువలేనివి:**

మన్నా చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ కు పరిచర్య చేయడం తో పాటు సంఘ కార్యక్రమాలలో సహకారం అందచేసిన గ్లాడీ ప్రేమ్ సన్ సేవలు మరువలేనివి అని మన్నా చర్చ్ సభ్యుల గుర్తుచేసుకున్నారు.

# ఘనంగా బిజెపి నేత రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నర్సింగ్ యాదవ్

**కూకట్ పల్లి, మే 17 (నమస్తే ఉదయం)**


శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రవికుమార్ యాదవ్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. శేరిలింగంపల్లి ప్రజల అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ నాయకులు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్, సీనియర్ నాయకులు నరసింహ చారి, ఆంజనేయులు యాదవ్, విష్ణు, చాంద్, సురేష్, రాజు, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ రవికుమార్ యాదవ్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటారని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన సేవలు మరింత అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం అభిమానుల హర్షధ్వానాలు, శుభాకాంక్షల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.



# గుక్కెడు నీటి కోసం మూడు మున్సిపాలిటీల్లో ప్రజలు అవస్థలు








### బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తిక్‌రెడ్డి

### అసమర్థ ప్రజా ప్రతినిధులు,అధికారులతో ప్రజలకు ఇక్కట్లు..

### 'మణికొండ లో మంచినీటి సమస్యపై బిఆర్ వాక్ ఫర్ వాటర్' పేరిట భారీ పాదయాత్ర

**మణికొండ,మే17(నమస్తే ఉదయం)**

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నాలుగు సార్లు గెలిచిన నాలుగు రోజులు కూడా ప్రజలకు సక్రమంగా నీళ్లివ్వలేకపోతున్నారని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.మంచినీటి సరఫరాపై ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కనీస అవగహన లేకపోవడం వల్లే ప్రజలకు నీటి ఇక్కట్లు తప్పడం లేదన్నారు. మణికొండలో ఆదివార నిర్వహించిన 'వాక్ ఫర్ వాటర్' పాదయాత్రలో స్థానిక ప్రజలతో కలిసి ఖాళీ బిందెలతో భారీ ఎత్తున కార్తిక్‌రెడ్డి మణికొండ లోని నిక్నాపూర్ బటర్ఫై చౌరస్తా నుంచి మరి చెట్టు చౌరస్తా వరకు సాగిన ఈ పాదయాత్రలో మహిళలు, యువకులు,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ...రోజు విడిచి రోజు కూడా తాగునీరు అందక నార్సింగి,బండ్లగూడ,మణికొండ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.బల్క్ కనెక్షన్ల పేరుతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై జలమండలి భారం మోపుతున్నదని ఆరోపించారు.ఈ ప్రాంతానికి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాశ్‌గౌడ్ ప్రజలకు నాలుగురోజులకు ఒకసారి కూడా నీళ్లు ఇవ్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.మంచినీటి సరఫరాపై స్థానిక ఎమ్మెల్యేకు కనీస అవగాహన లేకపోవడం వల్లే ప్రజలకు ఈ కష్టాలు వచ్చాయని అన్నారు.కేసీఆర్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించారని ఆయన గుర్తు చేశారు.బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాశ్‌గౌడ్ అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీలో చేరారని,ఈ




ప్రాంతానికి రావాల్సిన మెట్రోతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని విమర్శించారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని జంట జలాశయాలు చెంతనే ఉన్నా ఈ ప్రాంత ప్రజలకు గుక్కెడు నీరు అందకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కార్తిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.ప్రజలు ఎదుర్కొంటున్న




తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని,'వాక్ ఫర్ వాటర్' కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగిస్తామని కార్తిక్‌రెడ్డి స్పష్టం చేశారు.నియోజకవర్గంలో సరిపడా నీటిని అందిస్తున్నామని అధికారులు చెప్పడం వివేక శూన్యమని విమర్శించారు.పాదయాత్ర పొడవునా కనిపిస్తున్న వాటర్ ట్యాంకర్లే ఇక్కడి నీటి ఎద్దడికి ప్రత్యక్ష నిదర్శనమని మండిపడ్డారు.తాము పాదయాత్ర చేస్తున్న సమయంలో అనేక వాటర్ ట్యాంకర్లు కనిపించాయన్నారు.ట్యాంకర్లను బట్టి నీటి ఎద్దడి ఎంతగా ఉందో తెలుస్తుందన్నారు.తాము మంచినీటి సమస్యపై పోరాటం చేస్తున్నామని తెలిసి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆఘమేఘాలపై అధికారులతో చర్చలు జరిపారని తెలిపారు. ఇప్పటి వరకు ప్రజలు సమస్యలు గుర్తుకు రాలేదా.. తాము పోరాటం ప్రారంభించగానే ఎమ్మెల్యేకు ప్రజల సమస్యలు గుర్తుకు వచ్చాయా? అని ప్రశ్నించారు. పది రోజులకు ఒక్కసారి నీటి సరఫరా ఉందంటే అధికారులు ఎందుకు పని చేస్తున్నట్టు, ఎవరికోసం పని చేస్తున్నట్లు అని ప్రశ్నించారు.రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మంచినీటి నల్లా బిల్లులను వెంటనే మాఫీ చేయాలని కోరారు.రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జలాశయాల నుంచి నీటిని రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు అందిస్తామన్నారు.హైదర్‌బాద్‌కు ఏది కావాలన్నా గండిపేట మండలంపైనే ఆదారపడి ఉన్నారన్నారు.ఇక్కడి ప్రజల ఓట్లు కావాలి,ఇక్కడి భూములు అమ్ముతారు, టాక్సలు పెంచుతారు కాని నీటి సమస్యలను మాత్రం పటించుకోరా? అని మండిపడ్డారు.గండిపేట మండలంలో అనేక రకాల వనరులను వాడుకుంటూ పది రోజులకు ఒక్కసారి నీటిని వదలడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు.మేము మంచినీటి సమస్యపై పోరాటం ప్రారంభిస్తున్నామని తెలిసి,ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆఘమేఘాలపై అధికారులతో చర్చలు జరిపారని అన్నారు. ఇప్పటివరకు ఆయనకు ప్రజల సమస్యలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మణికొండ సీతారాం దూళిపాళ,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు పట్లోల రూపారెడ్డి ,నాయకులు ఎస్.వెంకటేష్,శీలం తిరుపతిరెడ్డి,మమ్మద్ జహీరుద్దీన్, జగదీష్,ఔరాధి రమేష్,పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



బైబిల్ సందేశాలను అందచేస్తున్న రెవరెండ్ ఎం విజయ్ కుమార్



వీ బి ఎస్ లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందచేసిన రెవరెండ్ ఎం విజయ్ కుమార్, సిస్టర్ సులోచన, సిస్టర్ మాధవి లు

# దేవుని ఆజ్ఞానుసారమైన జీవితాన్ని జీవించాలి

### రెవరెండ్ ఎం విజయ్ కుమార్

**బుద్వేల్, మే 17 (నమస్తే ఉదయం)**

దేవుని ఆజ్ఞానుసారంగా క్రైస్తవులు జీవించాలని మధుబన్ కాలనీ లోని బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ ఎం విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జరిగిన ప్రత్యేక ఆరాధన కార్యక్రమంలో ఆయన చర్చి సభ్యులనుద్దేంచి ప్రసంగించారు. ప్రతి రోజు దేవుని వాక్యము చదవాలని, ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలన్నారు. అప్పుడే యేసయ్య ద్వారా వచ్చే ఆశీర్వాదాలు పొందుకుంటారన్నారు. లేనట్లయితే ఆయన కోపానికి గురి కావాల్సి వస్తుందన్నారు. ఇటీవల నిర్వహించిన వెకేషన్ బైబిల్ స్కూల్ (వీబీఎస్) లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఆరాధన కార్యక్రమంలో చర్చి సభ్యులు పాడిన క్రైస్తవ ఆధ్యాత్మిక గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. బ్రదర్ దానియేల్ దేవుడు తన జీవితంలో చేసిన ఆశీర్వాదాలను సాక్ష్యం రూపంలో చెప్పి దేవుని మహిమ పరిచారు. కార్యక్రమంలో సిస్టర్ ఎ మాధవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికి హిందువులంతా ఐక్యంగా ముందుకు సాగాలి




హిందూ ధర్మ ప్రచారకులు రాధా మనోహర్ దాస్ ను సన్మానిస్తున్న శివరాంపల్లి బస్తీ పెద్దలు




మల్లెల శ్రీనివాస్ రెడ్డి కి జ్ఞాపిక ను బహుకరిస్తున్న బస్తీ పెద్దలు




హిందూ సమ్మేళనం లో పాల్గొన్న ప్రజలు

**బుద్వేల్, మే 17 (నమస్తే ఉదయం):**

హిందువులంతా ఐక్యంగా ఉంటు సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని ప్రముఖ హిందు ధర్మ ప్రచారకులు రాధా మనోహర్ దాస్ సూచించారు. శివరాంపల్లి లో శనివారం రాత్రి నిర్వహించిన హింధు సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందు సంస్కృతి సంప్రదాయాలు నేడు ప్రపంచ దేశాలు ఆచరిస్తున్నాయన్నారు. సనాతన ధర్మం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని తెలిపారు. కులాలు, మతాల పేరిట హిందువులంతా విడిపోవద్దని ఐక్యంగా ఉండాలన్నారు. ఇంటిలోపలే కులమతాలని, ఇంటి గడపదాటామంటే అందరం హిందువులమేనని గుర్తుంచుకోవాలన్నారు. ఒక హిందువుకు ఏమైన జరిగితే అందరు సంఘటితంగా ముందుండి ఐక్యత నిరూపించాలన్నారు. ఈ సందర్బంగా నిర్వహించిన సాంసతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివరాంపల్లితో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన బస్తీలు, కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజి కౌన్సిలర్ పెండ్యాల చంద్రమోహన్, శాగ ప్రతాప్ రెడ్డి కందాడ జనార్ధన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రావిచెట్టి యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ గుమ్మడి మోహన్ రెడ్డి, ప్రజా పొదుపు సంఘం అధ్యక్షుడు మల్లెల శ్రీనివాస్ రెడ్డి, నారన్ బాల్ రెడ్డి , డాక్టర్ సుల్తాన్ అమరేందర్, ఆనంద్ రెడ్డి, పిట్టల శివ ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్, పడమటి శ్రీధర్ రెడ్డి , ఎం ప్రభాకర్ రెడ్డి, దాసరి రమేశ్, బండారి శంకర్, నదాల రాజశేఖర్ రెడ్డి, సామల నరేందర్ రెడ్డి , సదాల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




రాజేంద్రనగర్ స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్‌లో సమావేశమైన 2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

# రాజేంద్రనగర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**బుద్వేల్, మే 17 (నమస్తే ఉదయం)**

26 సంవత్సరాల క్రితం రాజేంద్రనగర్ స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమై చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నేడు అనేక సంస్థలలో ఉద్యోగులగా, వ్యాపారులుగా ఉన్న వారందరు ఓకే వేదికలో సమావేశమై చిన్న నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. పాఠశాల ప్రధానోపాద్యాయులు పి జగన్మోహన్ రెడ్డి ఉపాధ్యాయులు ప్రభాకర్, మంజు జోషి, శోభ, సంజయ్ కుమార్ లను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాద్యాయులు పి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, బుడి బుడి అడుగులతో పాఠశాలకు వచ్చిన నాటి చిన్నారులు నేడు ప్రయోజకులై సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నారంటే సంతోషంగా ఉందన్నారు. ఎక్కడ ఉన్న మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. దేశం కోసం పాటు పడే వారిగా ఉ ండాలన్నారు. ఏ రంగంలో పనిచేస్తున్న అక్కడ మ ంచి పేరు తెచ్చుకునే విదంగా ఉ ండాలన్నారు.



సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్ ను సన్మానిస్తున్న కామన్ ప్లాట్ ఫామ్ అధ్యక్షులు క్రాంతి వర్మ

# సమాచార కమిషనర్‌ను సన్మానించిన కామన్ ప్లాట్ ఫాం ఎన్జీఓ ప్రతినిధి క్రాంతి వర్మ

**రాజేంద్రనగర్,మే17(నమస్తే ఉదయం) :**

తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకున్న దేశాల భూపాల్ ను కామన్ ప్లాట్ ఫాం ఎన్జీఓ ప్రతినిధి క్రాంతి వర్మ సన్మానించారు.ఈ సందర్భంగా క్రాంతి వర్మ మాట్లాడుతూ..పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారం,జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు,ప్రజలకు ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పించడం,ఆర్టీఐ చట్టం సమర్థంగా అమలు కావాలని,నిర్లక్ష్య అధికారులపై చర్యలు,జిల్లా కేంద్రాల్లో ఆర్టీఐ అవగాహన సదస్సులు,జిల్లా,పట్టణాల్లో ఆర్టీఐ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు,పారదర్శకత,జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేయాలనే అభిలాషను వ్యక్తం చేశారని గుర్తు చేశారు.ఇలాగే ఆయన విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.




# డ్రైనేజీ పొంగకుండా జలమండలి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

### బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి

**రాజేంద్రనగర్,మే17(నమస్తే ఉదయం)**

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జలమండలి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు.వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలలోని మ్యాన్ హోళ్లల్లో సిల్టును వెంటనే పూడికతీత తీయాలన్నారు.హైదర్ గూడ ప్రజల విజ్ఞప్తి మేరకు మరికొద్ది రోజుల్లోనే వర్షాకాలం వస్తున్నందున డ్రైనేజీ మ్యాన్ హోల్ లలో నిండి ఉన్న వ్యర్థాలను సిల్టును తీసివేయాలని లేకుంటే వర్షాకాలంలో వర్షాలు పడి మ్యాన్ హోల్స్ నిండి డ్రైనేజీ నీళ్లన్నీ రోడ్లమీద ప్రవహిస్తాయన్నారు.కాబట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని,కావున వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి వారి సిబ్బందిని పిలిపించి వారితో ఎయిర్ టెక్ మెషిన్,బకెట్ లతో వ్యర్థాలను మ్యాన్ హోల్ లలో నిండి ఉన్న ఇసుకను దగ్గరుండి తీయించారు.రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు కాకులారం కృష్ణ కిట్టు,హైదర్ గూడ బస్తీవాసులు మల్గారి బాలకృష్ణారెడ్డి,మల్గారి కొండల్ రెడ్డి,చెట్టిగారి సతీష్,సిబ్బంది నర్సింగ్,హరికృష్ణ పాల్గొన్నారు.

# క్యాన్సర్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి

### భగత్ సింగ్ నగర్ ఫేజ్-2 లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

### క్యాన్సర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

### టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్



**కూకట్‌పల్లి, మే 17 (మెట్రో ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గం, వసంతనగర్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ ఫేజ్-2 లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం అత్యంత విజయవంతంగా ముగిసింది. ప్రముఖ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో, బండి రమేష్ సహకారంతో, మాకినేని యాకనారాయణ (వినోద్) - విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలలోని కాలనీల నుండి సుమారు 200 మందికి పైగా ప్రజలు తరలివచ్చి ఈ ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. బసవతారకం ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం రోగులకు ఎంతో ఓపికగా పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్ పట్ల అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. వైద్యుల సేవలను కాలనీ ప్రజలు ప్రత్యేకంగా కొనియాడారు.

**ముఖ్య అతిథుల అభినందనలు**

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్ పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ఇంతటి ఉత్తమ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన మాకినేని యాకనారాయణ (వినోద్)ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు అరవింద్ రెడ్డి, గంధం రాజు, చావ శ్రీనివాస్, కిలారు శ్రీనివాస్ బాబు, గాలి బాలాజీ, దినేష్ కుమార్ తదితరులు పాల్గొని, శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు మాకినేని యాకనారాయణ (వినోద్) మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్ మహమ్మారి పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ముందస్తు పరీక్షల ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలన్నదే మా సంకల్పం. ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలందరికీ, అద్భుతమైన సేవలు అందించిన బసవతారకం ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే అహర్నిశలు శ్రమించి ఈ క్యాంప్‌ను విజయవంతం చేసిన వాలంటీర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మీ అందరి ఆశీస్సులు, సహకారం ఇలాగే కొనసాగాలని ఆయన కోరారు.



## ప్రతిభ చాటిన విద్యార్థులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 17(నమస్తే ఉదయం)**

తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్ష , రాష్ట్ర సాంఘిక శాస్త్ర సంయుక్త ఆధ్వర్యంలో టీజీ ఐఆర్డి రాజేంద్ర నగర్ లో మూడు రోజుల పాటు15. నుండి. 17 వరకు జరిగిన తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ ప్రోగ్రామ్ లో జోగులాంబ జిల్లా నుండి అయిజ జిల్లా పరిషత్ విద్యార్థి రవిచంద్ర, జెడ్ పి హెచ్ ఎస్ ధరూర్ విద్యార్థి మిస్బా, జెడ్ పి హెచ్ ఎస్ మల్దకల్ విద్యార్థిని షర్మిల, జెడ్ పి హెచ్ ఎస్ తక్కశిల విద్యార్థి రెహానా ఫర్వీన్, టి జి ఆర్ ఎస్ బీచుపల్లి విద్యార్థి సంజీవ్ , యుఎన్ఓ కమిటీ అయిన లోని అంశం అయిన "వ్యూహాత్మక సముద్ర మార్గాల సైనికీకరణ ద్వారా తలెత్తే ముప్పులను పరిష్కరించడం --- ముఖ్యంగా హార్ముజ్ జలసంధిపై ప్రత్యేక దృష్టి సారించడం". ఇతర అంతర్జాతీయ అంశాలపై అనర్గళంగా మాట్లాడి రాష్ట్ర స్థాయిలో 2, 3,4వ స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. వీరికి సమగ్ర శిక్ష ఆడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చేతుల మీదుగా అవార్డులను ప్రధానం చేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ పి. విజయ భాస్కర్ రెడ్డి, గైడ్ టీచర్స్ మద్దమ్మ , శ్రీహరి, రాణి మొదలగు వారు పాల్గొన్నారు.




## కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 17(నమస్తే ఉదయం):**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ మరియు కంప్రెసెడ్ నేచురల్ గ్యాస్ (సి ఎన్ జి) ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో గద్వాలలోని పాత బస్టాండ్ సెంటర్లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ. వెంకటస్వామి మాట్లాడుతూ బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు ప్రజలపై ఎలాంటి భారాలు వేయబోమని, పెట్రోల్ డీజిల్ ధరలు కూడా పెంచబోమని ప్రగల్బాలు పలికి ఎన్నికలు ముగియగానే పెట్రోల్ డీజిల్ పై మూడు రూపాయలకు పైగా సి ఎన్ జి పై రెండు రూపాయలకు పైగా ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపారని, "చెప్పేవి శ్రీరంగనీతులు దూరేది దొమ్మరిల్లు" అన్నట్టుగా బిజెపి నాయకుల వ్యవహారం ఉందని, ఎన్నాళ్ళని ప్రజలను మాయమాటలతో, మోసపూరిత విధానాలతో మధ్య పెడతారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లో పెట్రోల్ డీజిల్ ధరలు పెంచబోమని ఏప్రిల్ 30వ తేదీన బహిరంగంగానే చెప్పారని, అబద్దాలు మాట్లాడుతున్న మీరు ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని ప్రజల్లోకి వెళతారని ప్రశ్నించారు. ఆదివారం సి ఎన్ జి పై కిలోకి ఒక రూపాయి అదనంగా పెంచారని, రెండు రోజుల కాల వ్యవధిలోనే సీ ఎన్ జి ధరలు రెండుసార్లు పెంచడం ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనం అని అన్నారు. ఈ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చు పై ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా నిత్యవసర వస్తువులు, వ్యవసాయ ఉత్పాదకాలు , ప్రాథమిక సేవల ధరలు పెరుగుదలతో సహా ఆర్థిక వ్యవస్థ అంతటా ఇవి గొలుసుకట్టు ప్రభావాన్ని ప్రేరేపించడం ఖాయం అని అన్నారు. జి ఎన్ జి ధరల పెంపు వల్ల ఆటో డ్రైవర్లు, రవాణా కార్మికులు , తక్కువ ధరలతో ప్రజా రవాణా అందిస్తున్న కార్మికులపై మరియు ఆధారపడిన లక్షలాది మందిపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ఇంధన ధరలను అన్నిటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి తో పాటు నాయకులు తిరుపతన్న, లక్ష్మన్న, ఆంజనేయులు, రంగన్న,నరేష్, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## అవగాహన-ఆరోగ్యం-మహిళా శక్తి కోసం నిర్వహించిన "ఫైబ్రాయిడ్ రెడ్ స్ట్రెంత్ వాక్ "

**హైదరాబాద్, 17 మే(నమస్తే ఉదయం)**

రాజ్ బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ మహిళా ట్రైనీ అధికారులు, అకాడమీ సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రహేజా మైండ్‌స్పేస్ సమీపంలోని హోటల్ వెస్టిన్ వద్ద నిర్వహించిన "ఫైబ్రాయిడ్ రెడ్ స్ట్రెంత్ వాక్" కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని అపోలో హాస్పిటల్స్ మహిళల ఆరోగ్యంపై చైతన్యం కల్పించే లక్ష్యంతో నిర్వహించింది. ముఖ్యంగా అధిక రుతుస్రావం, గర్భాశయ ఫైబ్రాయిడ్స్ , రక్తహీనత వంటి సమస్యలపై మహిళల్లో అవగాహన పెంపొందించడం, ప్రారంభ దశలోనే నిర్ధారణ , నివారణ చర్యల ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్పర్సన్ శోభన కామినేని ఉదయం సుమారు 5.30 గంటలకు జెండా ఊపి 3 కిలోమీటర్లు , 5 కిలోమీటర్ల అవగాహన వాక్,రన్‌ను ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, ఐపీఎస్, డీజీపీ నాయకత్వంలో అకాడమీ నుండి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు,మహిళా సిబ్బంది, మహిళా ట్రైనీ అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్, సంక్షేమం, సామాజిక అవగాహన కార్యక్రమాల పట్ల తెలంగాణ పోలీస్ అకాడమీ నిరంతరం కట్టుబడి ఉందని అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తెలియచేశారు. ఈ కార్యక్రమం లో నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్ పాల్గొన్నారు.



## సింఫనీ పార్క్ హోమ్స్ స్థలాలను పరిరక్షిస్తాం:

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాలనీవాసులతో సమావేశం

### అధైర్యపడవద్దని భరోసా

**పటాన్ చెరు,మే 17 (నమస్తే ఉదయం):**

పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సింపని పార్క్ హోమ్స్ లో గల కాలనీ స్థలాలను ఆక్రమణలకు గురి కాకుండా పరిరక్షిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాలనీవాసులకు భరోసా అందించారు. గజం స్థలం సైతం కబ్జా కానివ్వమని తెలిపారు. కాలనీ ఏర్పాటు చేసిన సమయంలో కాలనీ అవసరాల కోసం ఆరు వేల గజాల స్థలాన్ని సంబంధిత బిల్డర్ కేటాయించడం జరిగిందని.. తదనంతరం బిల్డర్ స్వార్ధంతో కొందరు వ్యక్తులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని.. ఈ అంశంపై హైకోర్టులో స్టే ఉన్నప్పటికీ..ఇటీవల కొందరు ఆ భూమి తమకు రిజిస్ట్రేషన్ చేశారంటూ కబ్జా చేసేందుకు ప్రయత్నించడం జరుగుతోందంటూ కాలనీవాసులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై చర్చించేందుకు ఆదివారం సింఫనీ పార్క్ హోమ్స్ కమ్యూనిటీ లో నివసిస్తున్న గృహ యజమానులతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా కాలనీ అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని బిల్డర్ కక్కుర్తి తో ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడం చట్టపరంగా నేరమని తెలిపారు. చట్టం ప్రకారం ఈ స్థలం కాలనీకి చెందుతుందని తెలిపారు. ఈ అంశంలో ఎవరైనా తమ స్థలం అంటూ బలప్రయోగానికి దిగితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాలనీ వాసులు ధైర్యంగా ఉండాలని.. ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఆంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మించడంతోపాటు రామాలయం, శివాలయం, అమ్మవారి దేవాలయాలను సైతం సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. 2016లో కాలనీ ఏర్పాటైన నుండి నేటి వరకు అన్ని అంశాల్లో అండగా ఉంటూ తమ కాలనీకి కుటుంబ పెద్దగా వ్యవహరిస్తున్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని దిశా కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కాసాల సుధాకర్ అన్నారు. కాలనీ అభివృద్ధిలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాత్ర మరువలేనిదని అన్నారు. తాము ఎల్లప్పుడూ ఆయనకు అండగా ఉంటామని తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కోసం కేటాయించిన స్థలం అంశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సహకారానికి కాలనీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, జిహెచ్ఎంసి ఈఈ సురేష్ సిఐ వినాయక్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, హమీద్, డిఈ కృష్ణవేణి, కాలనీ అధ్యక్షులు సత్తిరాజు, సత్య రావు, లింగరాజు, విజయ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.



## మురుగునీటి కాలువ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం..

### త్వరలో 10 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,మే 17 (నమస్తే ఉదయం):**

బీరంగూడ డివిజన్ పరిధిలోని జయలక్ష్మి నగర్, లక్ష్మి సాయి మెడోస్ కాలనీల మీదుగా వెళ్తున్న ప్రధాన మురుగు నీటి కాలువలో గల బండతో మురుగునీరు ఒకే చోట నిల్వ ఉండడం మూలంగా వెలువడుతున్న దుర్వాసన సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ తో కలిసి కాలువను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల్లో బండను పూర్తిగా తొలగించి కాలువను శుభ్రపరచాలని జిహెచ్ఎంసి ఇరిగేషన్ ఎఇ గులాం ను ఆదేశించారు. కాలువ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడుతున్నామని తెలిపారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కాలనీలలో సీసీ రోడ్లు, యుజిడిల నిర్మాణం కోసం 10 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, ఈ నెల 23వ తేదీన శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి పరిష్కారం దిశగా కృషి చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈఈ సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.







## విద్యార్థులు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు నేర్చుకోవాలి

### ప్రణాళికతో భవిష్యత్తును నిర్మించుకోవాలి.

### వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

### ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు.

### జవహర్ బాలభవన్ డేలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 17(నమస్తే ఉదయం):**

విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు నేర్చుకుంటే తాము ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో చివరి రోజు ఆదివారం జవహర్ బాలభవన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. గద్వాల బాలభవన్ లో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకప్పుడు ఎడ్యుకేషన్ డే అంటే కేవలం చదువుకు సంబంధించి మాత్రమే నిర్వహించే వాళ్ళని ప్రస్తుతం లైబ్రరీ డే, బాల భవన్ డే వంటివి నిర్వహిస్తూ బోధనేతర అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఎప్పుడూ చదువుకోవడం అంటే ఒత్తిడి పెరుగుతుందని, ఇలాంటి బాలభవన్ శిక్షణలతో వారిలో సృజనాత్మకత అలవడుతుందన్నారు. విద్య అంటే కేవలం మార్కులు సాధించడం మాత్రమే కాదని క్రీడలు, సాంస్కృతిక వంటి బోధనేతర రంగాలపై కూడా విద్యార్థులు దృష్టి సారించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, ప్రస్తుతం ఎంపిక చేసిన పలు పాఠశాలల్లో చెస్, క్యారమ్స్, నృత్యం, చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ తదితర అంశాలపై నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోవాలంటే సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని, ఎక్కడికి వెళ్ళినా, ఎలాంటి వాళ్ళతోనైనా ధైర్యంగా మాట్లాడగలిగే నైపుణ్యాలు అవసరమని పేర్కొన్నారు. కంప్యూటర్, డిజిటల్ టెక్నాలజీ, ఏఐపై కూడా అవగాహన కలిగేలా విద్యార్థులకు కంప్యూటర్ మాస్టర్లు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్, తదితర కోర్సుల్లో చేరి చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు తమకు ఆసక్తి, డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకొని ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. విద్యార్థులు ప్రణాళికతో తమ భవిష్యత్తును నిర్మించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల వెలువడిన పదవ తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో టాపర్స్ గా నిలిచిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు పలు బహుమతులు, ప్రశంసా పత్రాలను జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి అందజేశారు. అంతకుముందు చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, పలు మండలాల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733